నేటి దినపత్రిక

# సూర్య

17 వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం | 29 జులై 2024 | పేజీలు 8

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిఆర్‌జిఎస్) కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమీషనర్ సూర్యతేజ ఆకాంక్షించారు. ఈనెల 29న సోమవారం ఉదయం 10 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో కమీష నర్‌ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకున్న సమస్యలను వీలున్నంత త్వరగా పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని కృషి చేస్తామని కమీషనర్ తెలిపారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

- కావలిలో దారుణం
- ముద్దాయిని అదుపులోకి తీసుకున్న సీఐ

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం తుఫాన్ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. తుఫాన్ నగరకు చెందిన 53 ఏళ్ల మహబూబ్ బాషా 9 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలికను నగ్నంగా సెల్ ఫోన్‌లో ఫోటోలు తీసి బెదిరిస్తూ.. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం గ్రహించిన బాలిక తల్లిదండ్రులు స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బాలికను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మానవ మృగాన్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుని 'సూర్య' ప్రతినిధి వివరణ కోరగా.. అత్యాచారం జరిగింది వాస్తవమేనని, ఫిర్యాదు అందంగానే ముద్దాయిని అదుపులో తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



## జిల్లా వరప్రసాదిని..

# సోమశిల జలాశయం

- డ్యామేజీలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం
- నిలిచిపోయిన మరమ్మత్తులు
- ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి ఆనం
- పరిశీలించిన మంత్రులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

జిల్లా వరప్రసాదిని, రైతులపాలిట ఆధునిక దేవాలయం, నెల్లూరు జిల్లారైతులకు సాగునీరు, ప్రకాశం జిల్లాకు సాగునీరు, తమిళనాడుకు తాగునీరందిస్తున్న సోమశిల ప్రాజెక్టు భద్రతపట్లగత ప్రభుత్వం అత్యంతనిర్లక్ష్యం చేసిందని సర్వత్రా విమర్శిస్తుండగా ప్రస్తుత ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణలను సోమశిలకు రప్పించి పరిశీలింపజేసిని రామనారాయణరెడ్డి త్వరితగతిన ఈపనులు పూర్తిచేయించాలని కోరగా ఇరిగేషన్ మంత్రి స్పందించి వెంటనే పూర్తిచేయిస్తామని హామీనిచ్చారు. గతంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలంలో ఉన్న సోమశిల జలాశయాన్ని ఇటీవల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ పరిశీలించారు. దాదాపు మూడేళ్ళ క్రితం వరదలకు సోమశిల జలాశయం ముంగిట ఆప్రాన్ పూర్తిగా దెబ్బతిన్నది. ప్రభుత్వం అక్కడి డ్యామేజిల గురించి సక్రమంగా పట్టించుకోకపోగా మళ్లీ రెండేళ్ళ క్రితం కూడా భారీ వర్షాలు కురవడం, గత సంవత్సరం మూడు రోజులుగా ఓమోస్తరు వర్షం కురవడంతో మరింతగా పగుళ్ళు పెరుగుతాయని, ఆందోళన చెందే పరిస్థితి ఏర్పడిరదని శ్రీధర్ పేర్కొన్నారు. సోమశిల, కండలేరు జలాశయాలు, నెల్లూరు, సంగం బ్యారేజిలు, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లు తదితరాల్లో దాదాపు180టిఎంసిల నీటిని రైతులకు అందించే పరిస్థితి కాగా అందుకు కీలకం సోమశిల ప్రాజెక్టు అని, ఇంతటి ప్రాధాన్యత కలిగిన సోమశిల జలాశయం వద్ద -మిగతా 2లో

## గుడి పక్కన మాంసం.. బడి పక్కన మద్యం !

జిల్లాలోని మండల కేంద్రమైన మర్రిపాడులో వింత పరిస్థితి చోటు చేసుకుంది. ఏకంగా దేవాలయం పక్కన మాంసం విక్రయాలు, పాఠశాల సమీపంలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఫలితంగా ఆలయానికి వచ్చిన భక్తులు దుర్వాసనతో, మద్యం ప్రియులు తాకిడతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు పాలకులు పట్టించుకోకపోవడంతో వారు ఆడిందే ఆటగా ఆడిందే పాటగా తయారై సాగుతోంది. మాంసాన్ని, మద్యాన్ని నడిపేందుకు తగు నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి వ్యాపారాలు సాగిస్తుండడం విశేషంగా మారింది.

- మర్రిపాడులో జోరుగా విక్రయాలు
- దుర్వాసనతో భక్తులు
- అవస్థలతో విద్యార్థులు
- చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :**

మండల కేంద్రమైన మర్రిపాడులో నియమ నిబంధనలు అమలు పరచడంలో అధి కారులు, పాలకులు విఫలం అయ్యారని చెప్పవచ్చు. మర్రిపాడు సెంటర్లో అభయాంజనేయ స్వామి ఆలయం నిర్మించబడి ఉంది. అయితే ఈ పవిత్రమైన ఆలయం పక్కనే చికెన్, మటన్, కోడి గుడ్లు వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో ఆలయం వద్దకు వచ్చేటట్టు భక్తులకు దుర్వాసన వెద జల్లుతుంది. ఎంతోమంది ఆ వ్యాపారులకు చెప్పినప్పటికీ విన్నపాపానపోలేదు. అధికారులు కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి ఇష్టాను సారమైంది. ఫలితంగా ఆలయానికి వచ్చేట టువంటి భక్తులు దుర్వాసనతోనే పవిత్రమైన ఆంజనేయ స్వామి ఆలయంలోకి ప్రవేశించి పూజలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ మాంసం విక్రయించే వ్యాపారస్తులు కూడా రహదారి పక్కనే ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసి సాగిస్తున్నారు. కనీసం రహదారి మార్జిన్ దిగను కూడా పరిస్థితి లేదు. దీంతో మాంసం విక్రయాల దుర్వాసన ఆలయంలోకి ప్రవేశిస్తుండడంతో.. -మిగతా 2లో



## చీర్ ఫర్ భారత్

### తెలిపిన ముక్కాల ద్వారకానాథ్




**నెల్లూరు విద్య, మేజర్‌న్యూస్ :** ఈనెల 26 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్ క్రీడలలో పాల్గొనే 117 మంది భారత జట్టు క్రీడాకారులకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారకానాథ్ సెల్ఫీ స్టాండ్‌లో భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. చీర్ ఫర్ భారత్ సంకేతాన్ని చూపించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారి సంస్థ విజయవాడ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్‌లో భారత క్రీడాకారులకు విజయం చేకూర్చాలని ఆయన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్ష సాధింపు చర్యలు వద్దు

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్‌లో అధికారంలో ఉన్నామన్న గర్వంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఎవరు పాల్పడవద్దని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచించారు. రూరల్ పరిధిలోని 19వ డివిజన్ శ్రీహరి నగర్ వద్ద పది లక్షల రూపాయలతో ఆదివారం పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల కనుగుణంగా తమ పాలన సాగుతుందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో పూర్తిగా గాడి తప్పిన ఆంధ్ర రాష్ట్రాన్ని అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి చంద్రబాబు గాడి పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేంద్రంగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డాక్టర్స్ విభాగం నేత జెడ్.శివప్రసాద్, నూకరాజు మదన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## గుడి పక్కన మాంసం.. బడి పక్కన మద్యం !




(మొదటి పేజీ తరువాయి)

భక్తులు తట్టుకోలేకపోతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పలుమార్లు ఆ వ్యాపారస్తులకు చెప్పినప్పటికీ మాటను పెడదోవ పట్టిస్తున్నారు తప్ప ఆచరించడం లేదని సమాచారం.

**మద్యం దుకాణంది అదే పరిస్థితి..**

మండల కేంద్రంలోని మర్రిపాడు సెంటరుకు అతి కొద్ది దూరంలో ఏపిలగుంటకు వెళ్లే రహదారిలో ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు రెండు నివాసాల తరవాత ప్రభుత్వ మద్యం దుకాణం వెలసింది. అధికారులు పాఠశాల పక్కన మద్యం దుకాణాన్ని ఎలా ఏర్పాటు చేశారో తెలియదు గానీ విద్యార్థులు మాత్రం ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఎక్సైజ్ అధికారులు జగన్ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా వ్యవహరించడంలో ఇది ఒక నిదర్శనం అని చెప్పవచ్చు. లేకపోతే పాఠశాల పక్కన మద్యం దుకాణానికి అనుమతి ఎలా ఇస్తారు అన్నది పలువురు ఆరోపిస్తున్నారు. చిన్నారులు విద్యను అభ్యసించే విద్యాలయం పక్కన మద్యం ప్రియులు తిరుగుతుంటే వారి ప్రేరణ ఎలా ఉంటుందో ఆలోచించాల్సి ఉంది. మద్యం దుకాణానికి పాఠశాల నుంచి వెళ్లాల్సి ఉంది. మద్యం సేవించిన మద్యం ప్రియులు మోటార్ సైకిల్ లలో వచ్చి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లుగా ఈ తంతు జరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. నిబంధనలకు దేవాలయానికి, పాఠశాలకు 100 మీటర్లు దూరంలో ఏవైనా నడపవచ్చునన్న నిబంధన ప్రకారం అతి కొద్ది సమీపంలో వీటిని నడపడం వల్ల ఎంత ప్రమాదమో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందువలన సంబంధిత అధికారులు పాలకులు పట్టించుకోని దేవాలయం పక్కనున్న మాంసం విక్రయాలను, పాఠశాల సమీపంలో ఉన్న మద్యం దుకాణం పై వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## కాలనీవాసులకు చెట్టే షెల్టర్



అంబేద్కర్‌నగర్ వద్ద బస్‌షెల్టరుగా ఉన్న చెట్టు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు మజరా అంబేద్కర్‌నగర్ వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలన్న వారి అభ్యర్థన కంఠశోషగానే ఉందని వాపోతున్నారు. కాలనీ బస్టాండు వద్ద ఒక రచ్చబండ ఉండగా మధ్యలో ఉన్న ఒక చెట్టే బస్‌షెల్టరుగా వినియోగించుకుంటున్నారు. ఎండల్లో సరే కానీ వర్షాకాలం ఈచెట్టు క్రింద తడిసి ముద్దవుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్ళనుండి తమ బస్టాండు వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోయిందని వారు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారుల్కైనా తమ అసౌకర్యం, అవస్థ గుర్తించి ఒక బస్‌షెల్టరు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఉచిత నేత్ర చికిత్స శిబిరానికి విశేష స్పందన



**పలమనేరు, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కె.ఆర్ జయశంకర్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రా చికిత్స శిబిరం నిర్వహించారు. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన పేద ప్రజల హాజరైనారు. ఈ కార్యక్రమానికి పిఇ ఎస్ వైద్యశాల కుప్పం వారి ఆధ్వర్యంలో డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వ హించారు. ఈ కంటి పరీక్షలకు 82 మంది హాజరు కాగా, ఇందులో 10 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయబడిందని తెలిపారు. ఆపరేష న్లకు ఎంపిక కాబడిన వారు పిఇఎస్ హాస్పిటల్ కుప్పం వారిచే ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. ఆపరేషన్ల కు ఎంపిక కాబడిన వారికి రాను పోను ఉచిత వాహన సదుపాయం కల్పించారు. ఆపరేషన్ చేయించుకోదలచిన వారు తలకు స్నానం చేసి తమ వెంట దుప్పటి తీసుకొని రావాలని తెలిపారు. కార్యక్రమంలో రవి, శ్రీరాములు శెట్టి, అమరనాథరెడ్డి, చంద్రయ్య శెట్టి, పిజెసిబాబు, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

# జిల్లా వరప్రసాదిని సోమశిల జలాశయం



జలాశయం ముంగిట దెబ్బతిన్న ప్రాంతంలో కొంతమేరకే జరిగిన పనులు

(మొదటి పేజీ తరువాయి)

2021 నవంబరులో తుఫాన్లు, వరదల సమయంలో ముందుభాగాన పలు దిమ్మెలు, కాలువలు తదితరాలు దెబ్బతిన్నాయని, 20 నుండి 30అడుగుల గోతులు పడ్డాయని, ఈవిషయయమై తాను అప్పట్లో పర్యటించి పరిశీలించి తమ పార్టీ అధినేత ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళామని, ప్రాజెక్ట్ కమిటీ పర్యటించి పరిశీలించి నివేదిక కూడా ప్రభుత్వానికి ఇచ్చారని శ్రీధర్ పేర్కొన్నారు. దెబ్బతిన్న వాటికి అత్యవసరంగా మరమ్మత్తులు చేయకుంటే తీవ్ర నష్టంవాటిల్లే ప్రమాదం ఉందని, జలాశయం ముంగిట పెద్ద గోతులు ఏర్పడితే జలాశయ పునాదులకు దెబ్బతగిలే పరిస్థితి ఉత్పన్నమవుతుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల సాగునీరు, తమిళనాడుకు తాగునీరు అవసరాలు తీరుస్తున్న అత్యంత ప్రాధ్యాన కలిగిన, ప్రయోజనకరమైన ప్రాజెక్టు అని, అలాంటి ప్రాజెక్టు వద్ద డ్యామేజిలు జరిగి రెండేళ్ళు కాగా ప్రభుత్వం ఏడాదిపాటు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించి గత సంవత్సరం మరమ్మత్తులకు 110 కోట్లు రూపాయల నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ 30 నుండి 35 శాతం పనులు చేయగా దాదాపు 22కోట్ల రూపాయలు బిల్లుల పెండిరగ్ పడడంతో పనులు నిలిపివేశారు. ఇక నాటి నుండి నేటివరకు పనులు పున:ప్రారంభం కాలేదు. ఇలాంటి ప్రాధాన్యతగల ప్రాజెక్టుల పట్ల గతపాలకుల చిత్తశుద్ధిని తేటతెల్లం చేసిందని పలువురు విమర్శిస్తుండగా మళ్ళీ బారీ వర్షాలు కురిస్తే సోమశిల జలాశయ భద్రత ప్రశ్నార్థకంగా ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తుండేవారు. డౌన్‌స్ట్రీమ్ పనుల్లో ప్రధానంగా డ్వెవర్షన్ కెనాల్ (11,12 గేట్లు ఉన్న కాలువ) వరదలకు దెబ్బతినగా డివైడిరగ్‌వాల్ పనులు తొలిగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినా కాంట్రాక్టర్ ఆదిశగా పనులు చేయలేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమశిలకు విచ్చేసిన అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి ఈపనుల విషయం ఆరు నెలల క్రితం అక్కడి ప్రజలు తీసుకెళ్ళగా, ప్రభుత్వంతో మాట్లాడి అక్టోబర్, నవంబరు నెలలోగా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారని, అమలుకు నోచుకోలేదని అక్కడివారు చెబుతున్నారు. ప్రతిఏటా నవంబరు నెలలో వరదలు సంభవించడం, పైతట్టు ప్రాంతాలనుండి అధికంగా నీరు జలాయానికి చేరడం, అధికమైతే పెన్నా నదికి, ఉత్తర, దక్షిణ కాలువలకు విడుదల చేయడం జరుగుతుంది. ఈ దఫా తీవ్ర వర్షాభావం కాగా జలాశయంలో తక్కువగా నీరు ఉండడం, వదర నీరు వచ్చే పరిస్థితి లేకపోగా, గత ఏడాది భారీ వర్షాలు అంటూ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిండంతో మళ్ళీ సోమశిల జలాశయం ముంగిట దెబ్బతిన్న ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందా ! అనే సందేహం పలువురిలో కలిగింది. వెంటనే నిలిచిన పనులు పున: ప్రారంభించకుంటే నెల్లూరు నగరం, నదీ పరీవాహక ప్రాంతాలకు పెను ప్రమాదకర పరిస్థితులు ఉంటాయని జనాలు అభిప్రాయపడుతుండేవారు. జిల్లా రైతాంగానికి ఆయువు పట్టుగా ఉన్న సోమశిల జలాశయాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు సత్వరమే నిధులు కేటాయించి బిల్లులు చెల్లించి మరమ్మత్తులు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతుండేవారు.

కాగా రాష్ట్రంలో తెలుగు దేశం ప్రభుత్వం రావడం, ఆత్మకూరు అభి.వృద్ధి ప్రదాతగా గతంలో పేరుగాంచిన ఆనం రామనారాయణరెడ్డి తాజాగా ఇక్కడ ఎమ్మెల్యే కావడం, రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకోవడంతో అందరిలో ఆశలు పెరిగాయి. ఆనంకు సోమశిల ప్రాధాన్యత తెలుసు కాబట్టి ఆయన వెంటనే స్పందించి అధికారులతో చర్చించడంతోపాటు రాష్ట్ర ఇరిగేషన్, మున్సిపల్ శాఖల మంత్రులను రప్పించి పరిశీలించడంతోపాటు తగు హామీ లభించినందున ఇక త్వరిగతిన ఈ పనులు పూర్తవుతాయని, ప్రజల్లో ఉన్న ఆందోళన తొలుగుతుందని భావిస్తున్నారు.

# తాటాకు గుడిసెలకే పరిమితమైన పమిడిపాడు గిరిజనులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం పమిడిపాడు వద్ద తాటాకు గుడిసెల నివాసాలకే పరిమితమైన గిరిజనులు (యానాదులు) రెంటికీచెడ్డరేవళ్లుగా మారామని తీవ్ర ఆవేదనతో చెబుతున్నారు. ఆదివారం ఆ గిరిజనుల గుడిసెలవద్ద **మేజర్‌న్యూస్** ప్రతినిధి పరిశీలించి అక్కడి మహిళలను పలకరిస్తే వారి గోడు అత్యంత దయనీయంగా ఉంది. ఏళ్ళు గడిచిపోతున్నా, ఎందరివద్ద వాపోతున్నా ఏమాత్రం ఫలితం లేకపోయిందని, తాము పక్కాగృహాల వాసానికి నోచుకోలేదని, తాటాకు గుడిసెలకే పరిమితమై ఉన్నామని, ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని, ఎన్నికల సమయంలో మాత్రం వచ్చి నాయకులు హామీలిస్తుంటారని ఆ గిరిజన మహిళలు విలపిస్తూ గోడు విన్పించారు. అనాదిగా పమిడిపాడు గ్రామం వెలుపల ఆత్మకూరు-వింజమూరు మార్గంలో రోడ్డు అంచున ఎగుడుదిగుడు వంకలప్రక్కన తాటాకు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తూ కూలీనాలీ పనులతో జీవనం సాగిస్తుండేవారు. వారంతా తాటాకు గుడిసెల వాసాలకే పరిమితమా అని పదేపదే మేజర్‌న్యూస్ ప్రచురించి అధికారుల దృష్టికి తెచ్చిన విషయం పాఠకులకు విధితమే. అయితే వారు నివాసాలుండే ప్రాంతం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోనిదని, అక్కడ పేదలకు గృహనిర్మాణాలకు లేఅవుట్ల ఏర్పాటు చేశారు. ఏడాదిక్రితం ఆ గిరిజనులకు కూడా స్థలాలు ఇస్తామని, ఇళ్ళు నిర్మిస్తామని, అందరికీ ఒకే చోట స్థలాలు కేటాయిస్తామని చెప్పి ఆగుడిసెలను తరలించాలని అధికారులు సూచించారు.

- **అందరికీ ఇళ్ళు.. తమకంట కన్నీళ్ళు**
- **ఎన్నికల్లోనే తమ అవసరం**
- **మహిళల ఆవేదనం**

తామంతా ఒక అంచున గుడిసెలు ఏర్పాటు చేసుకొని నివాసాలుంటున్నామని, తమకు లేఅవుట్‌లో ఒక్కచోట కాకుండా అక్కడక్కడా స్థలాలు ఇచ్చారని, ఇళ్ళు తమనే నిర్మించుకోమంటూ మంజూరు చేశారని, తాము నిరుపేదలమైనందున ముందుగా వ్యయం చేసే పరిస్థితి లేక మౌనందాల్చామని పేర్కొన్నారు. రెండేళ్ళు గడిచినా రెండిళ్ళకు శ్లాబులు కాంట్రాక్టర్ ద్వారా వేశారని, 15మందికిగాను మరో నాలుగు పునాదులు వేసి వదిలేశారని, కొందరికి రేషన్‌కార్డులు లేవంటున్నారని, దాహార్తితో అల్లాడుతుంటే సర్పంచ్ సతీష్‌నాయుడు ఒక కొళాయి వేయడంతో



తాటాకుపూరి గుడిసెల్లో నివాసాలుంటున్న గిరిజనులు

ఇబ్బంది తొలగిందని, ఇంటి కల మాత్రం సాకారం కావడం లేదని, అయితే తాము ప్రస్తుతం గుడిసెలు వేసుకున్న చోట ప్రక్కన గతంలో వర్మికంపోస్ట్‌యార్డ్ నిర్మించి నిరుపయోగంగా ఉండగా దాన్ని ప్రారంభించాలని, గుడిసెలను తొలగించాలంటూ ఎవరో అధికారులు వచ్చి హుకుం జారీచేసి వెళ్ళారని వివరించారు. ఇప్పట్లో తాము ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ళు నిర్మించుకోలేక, ప్రస్తుతం ఉన్న గుడిసెల్లో కూడా ఉండే పరిస్థితి లేక దిగాలు చెంది ఉన్నామని వారు తమ హృదయవిదారకమైన తమ గోడును వెళ్ళబుచ్చారు. అధికారులు వారి పరిస్థితిని గమనించి ఏదేని ప్రత్యామ్నాయం చూపుతారేమో చూడాల్సి ఉంది.

# తెలుగుభారతి ఆధ్వర్యంలో 'మంచిమాట' కార్యక్రమం



ప్రసంగిస్తున్న వక్త వెంకటరెడ్డి



పాల్గొన్న సమితి ప్రతినిధులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం మంచిమాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా ఒక ఆదివారం ఈ కార్యక్రమాన్ని తెలుగు భారతిసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. ఈదఫా 'దేవునికెరుక' అనే అంశంపై తెలుగు భారతిసేవాసమితి ప్రధానకార్యదర్శి ఏ.పి.వెంకటరెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని సుధీర్ఘంగా వివరించారు. అధ్యాత్మికలకు ఆలవాలమైన యాగభూమి, యోగభూమి అయిన ఈ భరతభూమి భక్తితో ప్రకాశం పొంది ముక్తితో వికాసం చెందిన విధానాన్ని ఆంధ్రమహా భాగవతంలోని గజేంద్రమోక్షం ఆధారంగా భక్తుల మనస్థత్వం, భగవంతుని ఆశీర్వాదతత్వం గురించి ఆయన సోదాహరణ కధలతో వివరించారు. ప్రేక్షకులకు వీనులవిందును, భక్త్యామృత సోనలపొందును కలిగించారు. ఈకార్యక్రమంలో సమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, శ్రీసాంబశివచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి, సమితి గౌరవాధ్యక్షుడు గోవిందరెడ్డి, గౌరవసలహాదారులు ఎస్.వి.రమణయ్య, ఎస్.వి.చలమయ్య, ఎస్.యానాదిరెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఆర్థికకార్యదర్శి ఒమ్మిన సుబ్రహ్మణ్యం, సహప్రధానకార్యదర్శి జి.రామిరెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్యస్వామి, నారాయణరెడ్డి, టి.సి.వి.సుబ్బయ్య, శ్రీనివాస రాజు, రామ్మోహన్‌రెడ్డి, సురేష్, అపర్ణ, ప్రచార కార్యదర్శి కలిశెట్టి రవీంద్రకుమార్, ఏపిజిబి చైర్మెన్ హరికృష్ణ, కృష్ణయ్య, సురేంద్ర, వెంకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్‌శోభాయాత్ర విజయవంతం

**▶ నిర్వాహకులకు అభివందనం**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల నిర్వహించిన శ్రీ హనుమాన్ శోభాయాత్ర కనీ, వినీ ఎరుగని రీతిలో విజయవంతం కావడంతో ఆదివారం ఈ కార్యక్రమ కార్యనిర్వాహకులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. స్థానిక త్రికోటేశ్వరకళ్యాణ మండపంలో శోభాయాత్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ శోభాయాత్రలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్న విషయం విధితమే. నిత్యాన్నదా, శ్రీ సాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచిపరమేశ్వరరెడ్డికి వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టడంలో అనేకమంది ప్రత్యేకంగా కృషిచేశారు. శోభాయాత్ర విజయవంతానికి కృషిచేసిన సుబ్బారెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరీష్‌లను కంచి పరమేశ్వరరెడ్డి స్వయంగా ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు కూడా కాషాయకండువాలు వేసి అభినందించారు. అందరికీ ప్రత్యేకంగా పరమేశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తే తన



సహకారం తప్పకుండా ఉంటుందని పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కాగా కార్యనిర్వాహకులు, భక్తులు పరమేశ్వరరెడ్డిని సన్మానించబోగా ఆయన హుందాగా తిరస్కరించి నిర్వాహకులే అందుకు అర్హులన్నారు. శోభాయాత్ర నిర్వహణ, అందరినీ రప్పించడం, ఏదేని లోటుపాట్లున్నాయా అనే అంశాలను వారు సమీక్షించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ రహిత సమాజానికి..**

# యువత భాగస్వామ్యం కావాలి

**▶ ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పిలుపు**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం వర్శిటీ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న రోటరీ క్లబ్ స్వచ్ఛంద సేవకులను రిజిస్ట్రార్ అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం మానవాళికి, వన్యప్రాణులకు గణనీయమైన ముప్పును కలిగిస్తుందన్నారు. సముద్ర తాబేళ్ళు, డాల్ఫిన్లు, తిమింగలాలు వంటి సముద్ర జంతువులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా పొరపాటు చేసి వాటిని తీసుకుంటాయని ఫలితంగా అవి అనారోగ్యంతో మరణానికి దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్షులు, ఇతర జంతువులు సైతం ప్లాస్టిక్ వ్యర్థాలలో చిక్కుకుపోతున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణ వ్యవస్థలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తోందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఒక ప్రాంతంలో పేరుకుపోయినప్పుడు, అది పర్యావరణ వ్యవస్థ యొక్క సమతుల్యతను దెబ్బతీస్తుందని, మొక్కలు, జంతువుల జీవితాలకు హాని కలిగిస్తుందని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంలోకి హానికరమైన రసాయనాలను విడుదల చేస్తాయని, ఇది సమాజానికి మరింత నష్టానికి దారితీస్తుందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం.. మానవ ఆరోగ్యానికి కూడా గణనీయమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని, ప్లాస్టిక్ వ్యర్థాలు విచ్ఛిన్నమైనప్పుడు, పర్యావరణంలో హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుందని, ఈ రసాయనాలు ఆహార గొలుసులోకి ప్రవేశించి మానవ ఆరోగ్యానికి హాని కలిగించవచ్చన్నారు. త్వరలో ఎస్వీయూలో క్లీన్ క్యాంపస్ - గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని ఉద్యమస్థాయిలో చేపడుతామని, ఇందుకోసం విద్యార్థులతో వాలంటీర్ల బృందాలను ఏర్పాటు చేస్తామని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు వేమూరి జయరాం ప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు శివాజీ, ఏబీవీపీ మాజీ జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ, స్వచ్ఛంద సేవకులు మార్కండేయ, ధరణి పాల్గొన్నారు.

# టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని పెట్టడానికి వీల్లేదు.!

▸ రామలింగాపురం మండల అధ్యక్షుడు చిలకపాటి శ్రీనివాసులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని 19వ డివిజన్, శ్రీహరి నగర్‌లోని తన కార్యాలయంలో, బీజేపీ రామలింగాపురం మండల అధ్యక్షులు చిలకపాటి శ్రీనివాసులు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిప్పు సుల్తాన్ వందలాదిమంది హిందువులను దీపావళి రోజున శిరచ్ఛేదన చేశాడని, బలవంతంగా హిందువులను ఇస్లాం మతంలోకి మార్చారన్నారు. అదేవిధంగా ఆడవారిపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు చేశారనీ అటువంటి వ్యక్తిని ఈరోజు కొంతమంది స్వార్థపరులు టిప్పు సుల్తాన్ ఒక దేవుడు, స్వాతంత్ర సమరయోధుడు వలె ఆయన విగ్రహ ప్రతిష్టలు చేయాలని కోరడం ఎంతో బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మీరు అబ్దుల్ కలాం లాంటి వ్యక్తుల విగ్రహాలు పెడితే మేము సైతం అందుకు ఒప్పుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంట విజయశ్రీ, బీజేవైఎం ఉపాధ్యక్షులు మదన్, బూత్ అధ్యక్షులు కిరణ్, బాల సుబ్రహ్మణ్యం చందు తదితరులు పాల్గొన్నారు.

# అనుమసముద్రంలో ఉచిత వైద్య శిబిరం




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని అనుమసముద్రం గ్రామంలో ఆదివారం ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన నలిశెట్టి రాజశేఖర్ సహకారంతో గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చుట్టుపక్క గ్రామాలైనటువంటి 110 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందు మీనన్ మాట్లాడుతూ.. వీల్స్ ఆన్ న్యూరో అనే ఆలోచనతో రోగులకు వద్దకు వెళ్లడం మా లక్ష్యం అని తెలిపారు. డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ ద్వారా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తమ గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించినందుకు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పులిమి సుధాకర్ రెడ్డి, షేరాజ్ సాయి, నౌ షేర్, సుకుమార్, రిషి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎన్‌బిజేఎస్ఎం ఆధ్వర్యంలో మెగా బ్లడ్ క్యాంప్




**నెల్లూరు (వైద్యం), మేజర్‌న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నెల్లూరు నగరం కాపు వీధిలోని జైన్ భవన్‌లో శ్రీ నాకోడా భైరవ్ జైన్ సేవా మండల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. శ్రీ నాకోడా భైరవ్ జైన్ సేవా మండల్ వారు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపుకు శ్రీ జైన్ శ్వేతాంబర మూర్తి పూజాక్ సంఘ్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. రక్తదానం ప్రాణంతో సమానం అన్న సూక్తికి ఆకర్షితులైన పలువురు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కిషోర్ జైన్, వైస్ ప్రెసిడెంట్ రాకేష్ జైన్, సెక్రటరీ జలదీప్ జైన్, జాయింట్ యస్సీ మిథున్ జైన్, ట్రెజరర్ దీపేష్ తదితరులతోపాటు శ్రీ నకోడా భైరవ్ జైన్ సేవా మండల్ సభ్యులు, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ సంబరాలు.. 'కంచి'కి ఆహ్వానం



కంచిపరమేశ్వరరెడ్డిని ఆహ్వానిస్తున్న ఏపిటిఎఫ్ నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం ఆవిర్భవించి 80సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా పెద్దఎత్తున సంబరాలు జరుపుకుంటున్నామని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని ఆగస్టు 10వ తేదీన నెల్లూరు జిల్లా విద్యా, వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరుకు చెందిన నిత్యాన్నదాత, శ్రీ సాంబశివచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డిని కలిసి అతిథిగా హాజరుకావాలని సురేంద్రరెడ్డితోపాటు తమ యూనియన్ ప్రతినిధులు ఆహ్వానించారు. విద్యార్థులను కూడా ప్రోత్సహిస్తున్న పరమేశ్వరరెడ్డి తమ సంబరాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమానికి రావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఏపిటిఎఫ్ బాధ్యులు చంద్రమోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంగయ్య, సురేష్, బందారు వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి, రామిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఖాజారెడ్డి, జయరామయ్య, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు



**కావలి, మేజర్‌న్యూస్ :** తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ హోదాలో ఉన్న అధికారిని స్మిత సబర్వాల్ దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసేలా దివ్యాంగులకు సామర్థ్యం లేదని అంచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆదివారం తెలుగుదేశం పార్టీ దివ్యాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు తెలిపారు. విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంలో కీలక పరిధిలో ఉన్న ఐఏఎస్ చదువుకున్న అధికారిని ఐఏఎస్ చదువుకున్న అధికారిని దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడడం దురదృష్టకరమని తెలిపారు. ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్ పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస, శైలేష్ సిహెచ్. వెంకటేశ్వర్లు, అమీర్ శెట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గోపి శెట్టిపల్లి రామయ్య, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు




**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీకి చెందిన వేణు, ప్రీతిల మనవరాలు ప్రియా పుట్టినరోజు సందర్భంగా ముంగమూరు ఆదరణ కేంద్రంలోని సభ్యులకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఎంఆర్ యువసేన అధ్యక్షులు మాట్లాడుతూ.. వేణు కుటుంబ సభ్యులు గతంలో అనేక కార్యక్రమాలు ఆదరణ కేంద్రంలో చేయడం జరిగిందన్నారు. వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం డైరెక్టర్ సింహాద్రి రావు, వారి తల్లిదండ్రులు స్మిత్ మౌనికా పాల్గొన్నారు.

## మినీ గోకులం షెడ్లకు సబ్సిడీపై రుణాలు

▸ మండలానికి 25 యూనిట్లు మంజూరు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** పశుపోషణ చేసుకునే రైతులకు ప్రభుత్వం మినీగోకులం పథకం ద్వారా 90శాతం రాయితీపై షెడ్లను నిర్మాణానికి సబ్సిడీ రుణాలు అందిస్తోందని ఏఎస్ పేట పశు వైద్యాధికారి తాహ అన్సారి తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ.. ఏఎస్ పేట మండలానికి 25 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. అలాగే మండలంలోని సన్న, చిన్న, పేద రైతులు, తాము పెంచుకుంటున్న పశువులకు 90 శాతంతో ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తోందని తెలిపారు. మండలంలోని రేషన్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్నచిన్న కారు రైతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. షెడ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం గ్రామంలోని రైతు సేవ కేంద్రంలను, గాని పశువైద్యశాలను గాని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# పూర్వ విద్యార్థుల కలయిక, ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కావ్య





**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఒక ప్రైవేటు హొటల్లో ఆదివారం కావలి జవహర్ భారతి కళాశాల నందు 1987వ సంవత్సరం తనతో బీకాం చదివిన పూర్వ విద్యార్థులతో కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ఆత్మీయ సమ్మేళనంతో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. చదువుకునే రోజుల్లో కాలేజీలు లో కొన్ని మధుర స్మృతులను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తనతో చదువుకున్న స్నేహితులతో కలిసి పాత స్మృతులను పంచుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కావ్య తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేను ఎవరు పార్టీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి అక్కడే విద్యార్థులకు బోధన పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడిగా కొంతకాలము పనిచేసే వ్యాపారాలు చేయాలని ఉద్దేశంతో ఉపాధ్యాయ వృత్తిని వదిలి వ్యాపార రంగంలోకి వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈరోజు ఒక శాసనసభ్యుడిగా నేను చదివిన కాలేజీలోనే ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లడం అదే రోజు నాతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. డబ్బు సంపాదించుకోవడం కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేసుకోవడానికి రాజకీయాల్లోకి వచ్చానని తన స్నేహితులకు తెలిపారు.

మనం ఎంత ఎదిగినా మన చిన్న నాటి స్నేహితులను మరవకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, మధు, వేమారమేష్, చెక్కాసూరి, నబి సాహెబ్, అనిల్, హాలీం పర్యవేక్షణలో ఘనంగా జరిగింది.

# ఇళ్ల స్థలాలపై విచారణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని దాసరిపల్లి గ్రామ రోడ్డు సెంటర్లో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు ఆదివారం వీఆర్వో వెంకట్ విచారణ చేశారు. సర్వేనెంబర్ 1191లోని 6.60 ఎకరాల విస్తీర్ణంలో 1998లో సుమారు 96 మంది లబ్దిదారులు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ఇటీవల వరకు లబ్దిదారులు వాటిని ఖాళీగానే వదిలేశారు. అయితే ప్రస్తుతం ఆ స్థలాల పక్కనే కావలి-సీతారామపురం 167-బీజీ జాతీయ రహదారి ఏర్పాటు కావడంతో ఆ స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో లేఅవుట్లో పట్టాలు మంజూరు చేసిన కొందరు లబ్దిదారులు చదును చేసి బేస్మట్టాలు నిర్మించ కుంటున్నారు. కొందరు స్థలాలను ఎక్కడున్నాయో తెలియకపోవడంతో దానిని ఆసరాగా చేసుకొని ఇతర వ్యక్తులు స్థలాలను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. పట్టాలు పొందిన లబ్దిదారులు తమ స్థలాలు ఎక్కుడున్నాయో చూపించాలంటూ తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో విచారణ చేసి వివరాలు సేకరించారు.

# అసంబద్ధ నిర్వహణపై మెతక వైఖరా.?

▶ చర్యలు చేపట్టాలి.. కఠినంగా శిక్షించాలి : బీజేవైఎం డిమాండ్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సరైన అనుమతులు లేకుండా, అసంబద్ధ పాఠశాల నిర్వహణ చేపడుతున్న లిటిల్ ఏంజెల్స్ ప్రైవేటు పాఠశాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అధికారులు చెప్పాలని బీజేవైఎం, టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన అనంతసాగరంలోని బిజెపి కార్యాలయంలో నాయకులు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. తమ కుమార్తె ప్రగతి సాధన పై ప్రశ్నిస్తే ఆ తండ్రిపై అమానుష దాడి చేయడం ఎక్కడి సంస్కృతో తేల్చాలని అన్నారు. పాఠశాల నిర్వహణకు అనుమతులు తీసుకున్న ప్రాంతంలో ఒక్కరోజు కూడా తరగతులు చేపట్టకుండా ఏ ప్రాతిపదికన ఉప్పలపాడు వద్దకు బదిలీ చేశారో నిగ్గు తేలాలన్నారు. పాఠశాల తీరుపై కరస్పాండెంట్ మల్లికార్జున వ్యవహార శైలిపై గతంలో ఎన్నో ఫిర్యాదులు అధికారులకు అందినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో మండల విద్యాశాఖ బయటపెట్టాలన్నారు. నిత్యం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిషిత తనిఖీలు చేపడుతున్న మండల విద్యాశాఖ అధికారులు పలు ఫిర్యాదులు అందుతున్న లిటిల్ ఏంజెల్స్ పాఠశాలపై ఎందుకు మమకారం చూపిస్తున్నారో చెప్పగలరా అని ప్రశ్నించారు. బోధన సరిలేదని, విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడటం లేదని, మధ్యాహ్న భోజన తనిఖీలు, పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయా అని అడిగి వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారని, మరి ప్రైవేటు పాఠశాలల తీరును పర్యవేక్షించరా, మీకు పట్టదా అని రాష్ట్ర బీజేవైఎం నాయకులు సాంబశివరెడ్డి అన్నారు. దాడి జరిగి రోజులు గడుస్తున్న చర్యలు లేకపోవడం వెనుక తమకు పలు అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. దాడి వెనుక వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు వచ్చిన ఏబీవీపీ నాయకులను అడ్డుకోవడం సరికాదన్నారు. పాఠశాలలో ఉన్న సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్య కార్యాలయాల వద్ద తాము ధర్నాలు నిర్వహిస్తామని మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. విద్యార్థి తండ్రి పై దాడి సిగ్గుచేటని, ఆటవిక చర్య అని మండల బిజెపి నాయకులు జగదీష్ అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతల పురుషోత్తం, బత్తల నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడంబరంగా ఆరంభం..

# తూతూమంత్రంగా నిర్మాణం

▶ బైపాస్‌రోడ్డు పనులు సగానికేపరిమితం
▶ మళ్ళీ గుంటలు యధాతథం
▶ స్పందించాలి నూతనప్రభుత్వం



గుంటలు పడిన రోడ్డు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో నుండి నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి వరకు ఉన్న బ్యెపాస్‌రోడ్డు అడుగడునా గుంటల మయమై వాహనకారులకు, పాదచారులకు అవస్థలుగా ఉండగా అనాదిగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, గుంటలు మరింతగా ఇబ్బంది పెడుతున్నాయని అందరూ వాపోతుండగా రెండేళ్ళక్రితం పనులు ఆడంబరంగా ప్రారంభించి అర్థాంతరానికే పరిమితం చేశారు. ఏదో తూతూమంత్రంగా కొంత మేరకే తారురోడ్డు నిర్మించి మిగతా ప్యాచింగ్‌లతో సరిపెట్టారు. మళ్ళీ స్వల్పకాలంలోనే గుంటలు పడుతూ అవస్థలు ఆరంభమవుతున్నాయని అందరూ విమర్శిస్తున్నారు. ఈమార్గంలో బస్సులు నడవకున్నా ఇతర వాహనాలన్నీ ఇదేమార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అదీగాక వాకింగ్ కోసం నిత్యం అధికంగా జనాలు ఈమార్గంలో నడుస్తుంటారు. రోడ్డుకు అడగుడునా పెద్ద గుంటలు పడి రోడ్డు దెబ్బతిని ఉండడంతో అటు వాహనకారులకు, ఇటు పాదచారులకు అసౌకర్యంగా, ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతుండేవారు. గతంలో ఈరోడ్డు దుస్థితి పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ సిపిఎం పాదయాత్ర చేయగా జనసేన రోడ్డుపై బైఠాయించి ధర్నా కూడా చేశారు. ప్రాధాన్యత కలిగిన ఈరహదారికి కనీస మరమ్మత్తులు చేపట్టాలన్న ఆలోచన అటు అధికారుల్లో కానీ, ఇటు పాలకుల్లో కానీ కలుగకపోవడం లేదని, తరచూ ఇదే మార్గంలో ప్రయాణించే అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ప్రయాణీకులు, వాహనకారులు వ్యాఖ్యానిస్తుండేవారు. కాగా అప్పటి మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ప్రత్యేకశ్రద్ధతో 76.5లక్షల రూపాయలు మంజూరు చేయించారని అధికారులు తెలిపారు. 2021 మార్చి 3వతేదీన డీఈ సాంబశివరావు, ఏఈ ఉమామహేశ్వరరావులు ఈరోడ్డు పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఒక జెసిబి పెట్టి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. తదుపరి రోడ్డుకు కొంత మట్టి, డస్ట్ తోలారు.. గుంతలను తాత్కాలికంగా పూడ్చారు.. మిగతా పనులు చేయకుండా నిలిపివేశారు. కాగా ఏడాదిక్రితం క్రితం ఈరోడ్డును నెల్లూరు-ముంబాయిరోడ్డు నుండి ఆరంభంలో తారురోడ్డు కొంతవరకే వేసి మిగతా రోడ్డుకు గుంతలు పడినచోట్ల అరకొరగా ప్యాచ్‌లు వేశారు. మళ్ళీ స్వల్పకాలంలోనే ఈరోడ్డు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిరది. పలుచోట్ల పెద్ద గుంటలు పడ్డాయి. ఒకచోట రోడ్డు ఛిద్రమవుతుంది, పూర్తిగా తారురోడ్డు అని, 76.5లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని చెబుతుండిన అధికారులు కొంతమేరకే వేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఈ నూతన ప్రభుత్వంలోనైనా మరి పూర్తిగా రోడ్డు వేసేలా అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.



అధికారులు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)



ప్యాచింగ్‌లతో సరిపెట్టిన రోడ్డు



రోడ్డు ఛిద్రమవుతున్న దృశ్యం

## స్ఫూర్తి ప్రదాతల పేర్లతో ప్రభుత్వ పథకాల అమలు హర్షణీయం

**- జనసేన పార్టీ నేత అంజూరు చక్రధర్**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** భావి తరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని జనసేనపార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ అన్నారు. ఈ సందర్భంగా అంజూరు చక్రధర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖలో పదకాలను డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి అభినందనలు గత ప్రభుత్వ పాలనలో అన్ని పదకాలకు ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకొన్నారు. ఆ దుస్సంప్రదాయానికి మంగళంపాడి విద్యార్ధులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామం మహనీయుల పేర్లతో పథకాలు అమలు చేయడం ద్వారా వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకొంటారు అని తెలిపారు.

## ఘనంగా డాలర్స్ దివాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న - ఎంజిరెడ్డి**

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు రేణిగుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రేణిగుంట బస్టాండ్‌లో పేదలకు అన్నదాన కార్యక్ర మం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు ఎంజిరెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



ఈ కార్యక్రమంలో తెలుగు పట్టణ యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం నేత రమేష్ చంద్ర ప్రసాద్‌కు శ్రద్ధాంజలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ మాజీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ మాజీ చైర్మన్ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ శనివారం స్వర్గస్థులయ్యారు. గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు ఒరూరుపేట గ్రామంలో ఆయన స్వగృహం నందు గజమాలతో నివాళు లర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపి, ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ శ్రద్ధాంజలి ఘటించినవారిలో పట్టణ టీడీపీ సీనియర్ నాయకులు గోగినేని భాస్కర్ నాయుడు, కొనతనేరి సర్పంచ్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.



## నేడు గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు వివిధ పనుల కౌలు కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మమత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవిక పీసులు సేకరణ లీజు హక్కు నిమిత్తం హిందూ దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ బహిరంగ వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. 2024 జూలై 29 నుంచి 2025 జూలై 28వ తేదీ వరకు పై పనుల లీజు హక్కు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆలయ కార్యాలయం సంప్రదించవచ్చని తెలిపారు.

## దేవళంపేటలో మన్ కీ బాత్



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని దేవళంపేటలో ఆదివారంనిర్వహించారు. కార్యక్రమాన్ని టీవీల ద్వారా ప్రచారం చేయడంతో పలువురు వీక్షించారు.

## రెంటాల చేనులో రథోత్సవం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాముల వారి రథోత్సవం వెదురుకుప్పం మండలం చెంచుగుడి నుండి రెంటాల చేను వరకు కొనసాగింది. రథోత్స వంలో రెండు వేలమంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు స్వాములవారికి హారతులు ఇచ్చి తమ భక్తుని చాటుకున్నారు. తిరుపతి ఇస్కాన్ దేవస్థానం వారి ప్రభువు, రూపేష్ ప్రభువుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా రథోత్సవ కార్యక్రమం జరగడం పట్ల ప్రజలు వర్షాన్ని వ్యక్తం చేశారు.



# టీడీపీకి గంధమనేని సేవలు చిరస్మరణీయం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు పేర్కొన్నారు. ఆదివారం గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ నివాసం వద్ద ఆయన భౌతిక కాయాన్ని మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, పలమనేరు ఎమ్మెల్యే మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ సందర్శించి నివాళులర్పించి ఆయన కుమారుడు రాజేష్, కుమార్తె జ్యోతి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి మాజీ అధ్యక్షుడు, ఎస్వి సుగర్స్ మాజీ చైర్మన్, నగరి నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స తీసుకుం టున్న ఆయన శనివారం రాత్రి తుదిశ్వాస వదిలారు. టిడిపి ఆవిర్భా వం నుంచి పార్టీ పునరుత్తేజానికి విశేష కృషిచేసిన ఆయన చనిపో వడం తెలుగుదేశం పార్టీకి, ఉమ్మడి జిల్లాకు తీరని లోటు. ఆయన స్వగ్రామం నింద్ర మండలంలో ఉన్నప్పటికీ పిచ్చాటూరు. రాజ కీయాల్లో 1986 దశంలో అరుణ అతిథి గృహం కేంద్రంగా రాజకీయ చతురత చాటుకొని చక్రం తిప్పారు. అటు ఎన్టీ రామారావుకి ప్రియ



శిష్యుడుగా, చంద్రబాబు నాయుడుకి సమకాలికుడిగా అత్యంత ఆప్తు డుగా ఉండి ఉమ్మడి జిల్లా రాజకీయాలను తనదైన శైలిలో చక్రం తిప్పి న ఘనత ఆయనకే దక్కింది. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలి యచేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపార్టీ కార్యదర్శి దశరద వాసు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గంగారపు గోపి,మాజీ కార్యదర్శి చంద్రమౌళి, పూతలపట్టు మండల పార్టీ అధ్యక్షులు దొరబాబు చౌదరి, మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, ఎస్ ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షు లు జయశంకర్ నాయుడు,రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు జనార్ధన రాజు, చంగల్రాయ్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ రాజశేఖర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బోయకొండలో అడుగడుగునా అధిక వసూళ్లు!

**- నూతన ఈవో సమస్యలు పరిష్కరించేనా?**

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానానికి అనునిత్యం వేలాదిమంది భక్తులు వచ్చివెళ్తుంటారు. దేవస్థానం వారు భక్తుల సౌకర్యార్థం అసౌకర్యాలు కలగకుండా మంచినీటి సదుపాయం, చలువపందిళ్ళు, క్యూలైన్లో చల్లటి గాలికోసం ఫ్యాన్లు మొదలగు సౌకర్యాలు బాగున్నాయి. కాగా కొండపైకి ఎక్కేటప్పుడు సరైన పార్కింగ్ లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం వలన భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే కళ్యాణ కట్టవద్ద టోకన్ తీసుకుని కూడా ఉద్యోగస్తులకు అధనంగా మామూళు చెల్లించాల్సిందే. అలాగే క్యూలైన్లో ఉచిత దర్శనం ఎలా ఉన్ననూ ప్రత్యేక దర్శనాల్లో మనకు తెలిసిన వాళ్ళ వస్తే టికెట్టు లేకున్నా దర్శనానికి వెళ్ళవచ్చును. ఇవన్నీ ఒక ఎత్తు అయితే వికలాంగులకు ప్రత్యేక దర్శనాలకు ఏర్పాటు చేసిన గేట్లను లద్దుపోటులో గల సిబ్బంది తాళాలు వేసుకున్నారు. వికలాంగులు చాలా ఇబ్బందులకు గురౌచున్నారు. అమ్మవారికి సమర్పించే పెద్ద భోగము, చిన్న భోగం జంతుబలుల వద్ద అధిక రేట్లకు తలలు అమ్ముచున్నారు.అంతే కాకుండా డబ్బుముట్టనిదే జంతుబలి ఇవ్వరు. అలాగే పొట్టేలు శు భ్రపరచుటకు దేవస్థానం వారు నాలుగు వందలు ధర నిర్ణయిస్తే ఇక్కడ ఏడువందలు వసూలు చేస్తున్నారు. కోడిని శుభ్రం చేయాలంటే వందరూపాయలు సమర్పించుకోవాల్సిందే. అలాగే పొట్టేలు తలను శు భ్రపరచడానికి దేవస్థానం వందరూపాయలు నిర్ణయిస్తే ఇక్కడ మాత్రం ముక్కుపిండి మూడు వందలు వసూలు చేస్తున్నారు. అలాగే కూల్ డ్రింక్ షాపులలో వాటర్ బాటిల్ ఒక లీటరు ముప్పై రూపాయలకు అమ్ముతున్నారు. దీనిపై ఎవరైన భక్తులు ప్రశ్నిస్తే తాము రూ.లక్షలు పెట్టి టెండర్లు పాడాము, అమాత్రం సంపాదించుకోవద్దా? అంటూ మాట్లాడుతున్నారు.ఇలా బోయకొండ దేవస్థానానికి వచ్చే భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. నూతనంగా వచ్చిన ఈవో ఏకాంబరం ఈ ఆలయంలో కార్యనిర్వాహణాధికారిగా ఇది మూడవ సారి నియామకం జరిగింది. అంటే సదరు కార్యనిర్వాహణ అధికారికి ఇక్కడ ఎటువంటి ఆదాయ మార్గాలు ఉన్నాయో ఇట్లే తెలిసిపోతుంది. అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలో గల ఈవో తిరిగి తిరిగి ఇక్కడే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తునందున సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పరిపాలనా కార్యాలయంలో పిఆర్ఓగా ఓ మహిళ విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను ఏమి అడిగిననూ ఈవోను అడగండి అనే సమాధానం తప్ప ఇంకోక్కటి లేదు. అంతే కాకుండా దేవస్థానం నందు సిబ్బంది విధినిర్వహణలో కుల తారతమ్యాలు ఉన్నట్లు కనబడుతుంది. ఇక నైన ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఈవో చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతు న్నారు. ఈ విషయమై ఈఓను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.





# ఘనంగా డాలర్స్ దివాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** డాలర్స్ గ్రూప్ అధినేత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. డాలర్స్ దివాకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చంద్రగిరి తిరుపతి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆయన అభిమానులు స్నేహితులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు డాలర్స్ గ్రూప్ కస్టమర్లు భారీగా కేకులు మిఠాయిలు పంచుతూ బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకు న్నారు, పేదలకు రోగులకు అన్నదాన రక్త దాన శిబిరాలు ఏర్పాటుచేశారు. తొండవాడ ముక్కోటి శివాలయం దగ్గర డాలర్స్ దివాకర్ రెడ్డి అమ్మగారైన రాజేశ్వరమ్మ పాల్గొని సుమారు 600 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. తిరుపతి రుయా మెటర్నటీ హాస్పిటల్ ఫిష్ మార్కెట్ సి రామాపురం దగ్గర ఆయన




అభిమానులు ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఆయన అభిమా నులు మాట్లాడుతూ డాలర్స్ దివాకర్ రెడ్డి, ఎంతోమంది పేద విద్యార్థులకు స్కూలు కాలేజీ ఫీజులు, కిడ్నీ బాధితులకు ప్రతినెలా ఉచి తంగా మందుల పంపిణీ, జూడో క్రీడాకా రులను ప్రోత్సహించడం, చెస్ టోర్నమెంట్లు నిర్వహించడం ఇంకా మరెన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిగా చంద్రగిరి శ్రీకాళహస్తి నియోజకవర్గాలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయంలో తనదైన శైలిని ప్రదర్శించి కూటమి అభ్యర్థులను విజయ విజయతీరానికి చేర్చడానికి ఎంతగానో కృషి చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాలర్స్ దివాకర్ రెడ్డి అభిమానులు తెలుగుదేశం జనసేన పార్టీ కార్యకర్తలు డాలర్స్ గ్రూప్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చౌడేపల్లిలో రికార్డుల భద్రమేనా?

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండల కార్యాలయంలో రికార్డులన్నీ సక్రమంగా,భద్రంగా ఉన్నాయా? మండల కార్యాలయాల సముదాయంలో సచివాలయం రెండు అనే భవనంలో పాతరికార్డులను కుప్పలు తెప్పలుగా పోసియున్నారు.ప్రస్తుత పరిస్థితులలో రికార్డుల పరిస్థితి తెలిసినదే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి,అక్రమాల తాలుకు వివరాలు బయటకు పొక్కనీయకుండా రికార్డులను కాల్చివేస్తున్న సంగతి తెలిసినదే ఐతే చౌడేపల్లి మండల కార్యాలయాల సముదాయం పక్కనే గల గదిలో పాత రికార్డులను వేసి వాటికి సరైన తాళం కూడా వేయకుండా అలానే ఆదివారం వదిలేశారు.కావున ఇకనైనా అధికారులు అప్రమత్తం అవ్వాల్సిన అవసరం ఉంది.చౌడేపల్లి మండల కార్యాలయానికి సంబంధించిన రికార్డులను భద్రపరచాల్సిన అవసరం ఉంది.




## వైష్ణవీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని పుదిపట్లలో వెలసివున్న వైష్ణవీదేవి ఆలయంలో ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని, వైష్ణవి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వినోద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సామాగ్రిని వితరణ

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నారా భువనేశ్వరమ్మ చేతుల మీదగా దండికుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడాసామాగ్రిని వితరణ చేశారు. లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజులపాటు పర్యటించడానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి చేతులు మీదుగా విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందివ్వడం తమకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలో లయన్స్ క్లబ్ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించి లైన్స్ క్లబ్ వారిని అభినందించారని తెలిపారు. ఇలాంటి ప్రజాసేవకు ప్రతి ఒక్కరు నడుం బిగించి ప్రజా సేవలో పాల్గొనాలని ఆమె తెలిపినట్లు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నాయకులు డా సురేష్ బాబు, విశ్వనాథ్ నాయుడు, ఉదయ్ కుమార్, క్లబ్ సభ్యులు చరణ్, పలువురు పాల్గొన్నారు.



## అరవై ఏళ్ళ అనుబందం ఒకచోట
## ఇరవై ఏళ్ళ అనుబందం ఒకచోట అపూర్వ కలయిక

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని రెండు వేర్వేరు పాఠశాలలో పూర్వవిద్యార్థుల కలయిక అపూర్వంగా జరిగింది. చౌడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1965-66 యస్.యస్.యల్.సి బ్యాచ్అపూర్వ కలయిక వృద్ధాప్యంలో నడవలేక, సరిగా చూపు కనబడక, కళ్ళద్దాలను సరిచేసుకుంటూ, ఒకరినొకరు గుర్తుపట్టుకొని,నాటి కొంటెపనులను మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, తమ జీవన శైలిని,ఒకరికొకరు ముచ్చటించుకుంటూ ఒకరి నొకరు ఆలింగనం చేసుకున్నారు. అలాగే మండలం లోని మేకలచిన్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చదివిన 2005-06 యస్సెసి బ్యాచ్ అందరూ పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయానురాగాలతో పిలుచుకొని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.





## షిరిడి యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నుంచి షిరిడి వెళుతున్న బస్సు యాత్రను చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఆదివారం చిత్తూరు నగరంలోని స్థానిక కట్ట మంచి నందు గల ఎస్బిఐ అపార్ట్మెంట్స్‌లో గల షిరిడి సాయిబాబా మందిరము నుంచి షిరిడి సాయి దర్శనార్థం వెళుతున్న భక్తులకు అభయ సాయి ట్రస్ట్ చైర్మన్ రామ్మూర్తి రెడ్డి, లోకేష్ రెడ్డి తమ సొంత నిధులతో ఎస్బిఐ అభయ సాయి ట్రస్ట్ ఏడవ సంవత్సరం 350 మంది షిరిడి యాత్రకు వెళుతున్న భక్తులకు ప్రయాణ ఏర్పాట్లతో పాటు భోజన వసతులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.



## హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌తో బీ వైరస్ అంతం

### నోడల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** హెపటైటిస్ బి వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా వైరల్ హెపటైటిస్ బి వైరస్‌ను అంతం చేయొచ్చని ప్రోగ్రామ్ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ తెలిపారు. ప్రపంచ హెపటైటిస్ బి దినోత్సవం సందర్భంగా నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం వారి ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ జైల్లో నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ అపర్ణ, జైలర్ గుణశేఖర్ రెడ్డి, హెపటైటిస్ బి టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ కుమార్ హాజరయ్యారు. డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ వైరల్ హెపటైటిస్ (వైరస్ సంబంధిత కాలేయ వ్యాధి) ప్రపంచంలో అధికంగా ప్రబలుతున్నదన్నారు. కాకపోతే వైద్య విజ్ఞానం పెరగటం వలన వైరల్ హెపటైటిస్ కు మంచి మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులలో హెపటైటిస్ బి వైరస్ వ్యాప్తి నిరోధానికి టీకా అందుబాటులో ఉన్నాయన్నారు. 2030 కల్లా పూర్తి హెపటైటిస్ బి రహిత ప్రపంచాన్ని చూడాలని ఉద్దేశంతో ప్రభుత్వము, ప్రపంచ ఆరోగ్య సంస్థలు అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. హెపటైటిస్ బి,సి రక్తం ద్వారా, శుభ్రంగా లేని సిరంజిలు, నీడిల్స్, బ్లేడ్లు, శుభ్రంగా లేని రక్తను ఎక్కించడం వలన, విచ్చలవిడి శృంగారం తదితర వాటి వలన సంక్రమిస్తుందని తెలిపారు. శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం వలన హెపటైటిస్ ఎ, హెపటైటిస్ ఇ వైరస్‌ను నివారించవచ్చని తెలిపారు. హైపటైటిస్ బికు వ్యాక్సిన్ అందరూ తీసుకోవాలని, జాతీయ టీకా కార్యక్రమంలో పిల్లలందరికీ హెపటైటిస్ బి వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్ అపర్ణ తెలియజేశారు. రుయా ఆస్పత్రిలో ఓపి నెం.20 నందు ప్రతి రోజు హెపటైటిస్ బి,సి వైరస్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కావున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ధనంజయ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**బుచ్చినాయుడు కండ్రిగ, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ గవర్నమెంట్ హైస్కూల్ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 200 మంది ప్రజలు ఈ వైద్య శిబిరానికి హాజరై వారికి అవసరమైన ఆరోగ్య సలహాలను తెలుసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్స్ డాక్టర్ లు ప్రజలకు అవసరమగు పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితముగా అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన హాస్పిటల్స్ డైరెక్టర్ గుద్దూరు మయూర్‌లి మాట్లాడుతూ శ్రీకాళహస్తి, బుచ్చినాయుడు కండ్రిగ, నాయుడుపేట, సూళ్లూరుపేట, ఏర్పేడు మరియు చుట్టు ప్రక్క గ్రామాల ఆరోగ్య సంజీవనిగా హాస్పిటల్స్ స్థాపించిన ముఖ్య ఉద్దేశ్యం అని 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండి అతితక్కువ ఖర్చుతో ప్రజలకు వైద్య సేవలు చేస్తున్నారని అలాగే ఆరోగ్యశ్రీ వైద్య సేవ ద్వారా ఉచితంగా ప్రజలకు వైద్యం అందుబాటులో కలదని ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకొనగలరని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన హాస్పిటల్స్ యాజమాన్యానికి, డాక్టర్లకు, సిబ్బందికి బుచ్చి నాయుడు కండ్రిగ ప్రజలు ధన్యవాదములు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్స్ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా డాలర్స్ దివాకర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

### రక్తదానం అన్నదానం శిబిరాలతో సేవా కార్యక్రమాలు

### పలు ప్రాంతాలలో కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్న డాలర్స్ అభిమానులు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** డాలర్స్ గ్రూప్ అధినేత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం తిరుపతి చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, స్నేహితులు తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు పలు ప్రాంతాలలో భారీ కేకులు కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. అలాగే సేవా కార్యక్రమాలతో రుయా హాస్పిటల్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి బ్లడ్ డొనేషన్ చేశారు. డాలర్స్ అభిమానులు మాట్లాడుతూ డాలర్స్ దివాకర్ రెడ్డి సేవా దృక్పథంతో ప్రజలకు విద్యార్థులకు కిడ్నీ బాధితులకు క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ వారికి సహాయ సహకారాలు అందించి వారికి తోడ్పాటును అందించారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శిగా చంద్రగిరి శ్రీకాళహస్తి నియోజకవర్గాలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయంలో తనదైన శైలిని ప్రదర్శించి కూటమి అభ్యర్థులను విజయానికి ఎనలేని కృషి చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాలర్స్ దివాకర్ రెడ్డి అభిమానులు తెలుగుదేశం జనసేన పార్టీ కార్యకర్తలు డాలర్స్ గ్రూప్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



▶ నిర్మించి వదిలేశారు

# వాటర్ ప్లాంట్‌కు.. రాజకీయ గ్రహణం.!



అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా ఉంది ఆ కాలనీవాసుల పరిస్థితి. త్రాగు నీటికి ఇబ్బంది పడుతున్న తరుణంలో వాటర్ ప్లాంట్‌ను నిర్మించినప్పటికీ అది కాస్త ప్రారంభానికి నోచుకోక నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్లాంట్ ప్రారంభోత్సవానికి రాజకీయ గ్రహణం ఏర్పడటంతో కాలనీవాసులకు త్రాగునీటికి కూడా ఇబ్బందులు పాలు చేస్తోంది. ఈ పరిస్థితి మర్రిపాడు మండలం రామానాయుడుపల్లి ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లేకెళ్తే..

## తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీ వాసులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం రామా నాయుడుపల్లి ఎస్సీ కాలనీలో 50 కుటుంబాల కు పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఈ తరుణం లో ఆ కాలనీలో త్రాగునీటి ఎద్దడి ఏర్ప డింది. ఫలితంగా గొంతు తడుపుకు నేందుకు ఆ కాలనీవాసులు పడరాని పాట్లు పడుతున్న తరుణంలో పాలకు ల పుణ్యమా అని వైసీపీ పాలనలో ఎంపీ నిధులు 5లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పంచాయతీ సర్పంచ్ వాటర్ ప్లాంట్‌ను ఆ నిధులతో నిర్మించాడు. ఆ ప్లాంట్‌ను నిర్మించి పూర్తి చేసి కూడా ఆరు నెలలు మించిపోయింది. ఇక ప్రారంభోత్సవం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల వేడి తాగింది. ప్రారంభోత్సవం నిర్లక్ష్యమైంది. ఈలోగా ఎన్నికల కోడ్ రానే వచ్చేసింది. ఇంకేముంది ప్రారంభోత్సవం ఆగి పోయింది. ఫలితంగా వేసవి నుంచి ఆ కాలనీ వాసుల గొంతు ఎండుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. దీంతో ఆ వాటర్ ప్లాంట్‌ను ఎవరు ప్రారంభించాలో తెలియని పరిస్థితి. ఇరు పార్టీల మధ్య ఆ వాటర్ ప్లాంట్‌కు రాజకీయ గ్రహణం పట్టింది. దీంతో కాలనీవాసులు త్రాగునీటికి ఇబ్బందులు పడక తప్పడం లేదు. మరో గత్యంతరం లేక కాలనీ నుంచి రామానాయుడుపల్లి గ్రామానికి వెళ్లి క్యానులలో మంచి నీటిని తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్నారు. అధికారులు కూడా మౌనం దాల్చడంతో కాలనీలో త్రాగునీటి సమస్య ఎప్పుడు తీరుతుందోనని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ గ్రహణం పట్టిన ఈ వాటర్ ప్లాంట్‌ను అధికారులు పట్టించుకోని ప్రారంభించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

# గంధమహెూత్సవానికి రూ.లక్ష విరాళం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణం పంచాయతీ బస్టాండ్ సెంటర్లో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీహజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదరీఔలియా వారి 219వ గంధమహెూత్సవం వచ్చేనెల 3న జరగనుంది. ఈ నేపథ్యంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం కావలిలోని తన నివాసంలో గంధవ హెూత్సవ నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. ప్రతి ఏడాది గంధమహెూత్సవానికి విరాళం అందజేయడం అనవాయితీ అని, అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అందజేశామన్నారు. అనంతరం గంధమహెూత్సవానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్ ధర్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్ భాషా, కావ్య ట్రస్టు ప్రతినిధి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

# 30న సృజన ఆధ్వర్యంలో మిత్రరత్న పురస్కారాల ప్రధానం

**నెల్లూరు (కల్చరల్), మేజర్‌న్యూస్ :** సృజన సాహిత్య సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన మిత్రరత్న అవార్డుల ప్రధాన స్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సమస్త అధ్యక్షులు రాధాకృష్ణ ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొట్టే రామ్మూర్తి కోటా గురుబ్రహ్మం సంకలతో వివిధ రంగాలలో రాణిస్తున్న ప్రముఖులకు మిత్రమా అవార్డుల ప్రధాన చేస్తున్నట్లు కళాకారులు అభిమానులు కరెక్ట్‌లో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

# జవహర్ భారతి కళాశాల అంటేనే ఎక్కడలేని అభిమానం ఆత్మీయత

▶ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న శాసనసభ్యులు కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి జవహర్ భారతి కళాశాలలో పులివర్తి రామ్మోహన్ నాయుడు వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్న కావల్ టౌన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఆదివారం కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి హాజరై ప్రారంభించారు. ముందుగా పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జవహర్ భారతి కళాశాలలో చదివి ఇక్కడే లెక్చరర్‌గా పనిచేసి ఈరోజు ఎమ్మెల్యేగా ఒక ప్రజాప్రతినిధిగా ముఖ్యఅతిథిగా నేనే పాల్గొనే అవకాశం వచ్చినందుకు నాకు ఎంతో ఆనందం, సంతోషం, అలాగే ఒళ్ళు పులకరిస్తుందని తెలిపారు. అలాగే జవహర్ భారతిలో చదువుకొని పలువురు విద్యార్థులు క్రీడల్లోనూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తున్నారని తెలిపారు. అలాగే విద్యలో కూడా రాష్ట్రంలో ఉన్నత స్థితిలో పదవులు పొందిన వారు ఉన్నారని వారు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని కళాశాలకు మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన తెలిపారు. అనంతరం కొద్దిసేపు రెక్టార్. వినయ్ కుమార్ రెడ్డితో పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని అలాగే అక్కడ సిబ్బందితో కూడా తమ ఆత్మీయతను పంచుకున్నారు. అనంతరం వినయ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే కావ్యాన్ని శాలువాతో కప్పి పూల నుంచి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు నాయకులు జ్యోతి బాబురావు, మన్నవ రవిచంద్ర, ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జనసేన నాయకులు ఎంవి సిద్దు కళాశాల విశ్రాంతి ప్రిన్సిపాల్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, ఆర్.మాల్యాద్రి పీ.ప్రసాద్ రెడ్డి, చేవూరు మణికంఠ, టెన్నిస్ క్రీడాకారులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# చీర్ ఫర్ భారత్ తెలిపిన ముక్కాల ద్వారకానాథ్



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** 26వ తేదీ నుండి ఆగస్టు 11వ తేదీ వరకు పారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్ క్రీడల లో పాల్గొని 117 మంది భారత జట్టు క్రీడాకారులకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారకానాథ్ సెల్ఫీ స్టాండ్ నందు భారత క్రీడాకారు లకు శుభాకాంక్షలు తెలుపుతూ చీర్ ఫర్ భారత్ను సంకేతాన్ని చూపించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారి సంస్థ విజయవాడ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా ఐసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్ నందు భారత క్రీడాకారులకు విజయం చేకూర్చాలని శుభాకాంక్షలు ఆకాంక్షిస్తూ ఆయన క్రీడాకారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధికారులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా, రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల

# ఎంపికలను ప్రారంభించిన ముక్కాల ద్వారకనాథ్




**నెల్లూరు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలను ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకనాథ్ ప్రారంభించారు. ఈ పోటీలు బాల బాలికలకు అండర్ 11, 13, 15, 17, 19 మెన్, ఉమెన్‌ల కేటగిరీలలో సింగిల్స్ డబుల్స్ విభాగాలలో జరుగుతాయని ఎంపిక అయిన క్రీడాకారులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి 180 టీములు పాల్గొనడం చాలా ఆనందదాయకం అన్నారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఖచ్చితమైన వయస్సు ధ్రువీకరణ పత్రాలతో బాడ్మింటన్ అసోసియేషన్ గుర్తింపు పొందాలని, బాయ్ ధ్రువీకరించిన టోర్నమెంట్లలోనే క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. బాయ్ గుర్తింపు లేని టోర్నమెంట్లలో ఆడి తమ విలువైన సమయాన్ని, ధనాన్ని వృధా చేసుకో వద్దని క్రీడాకారుల తల్లిదండ్రులకు విన్నవించారు. అక్టోబరులో నెల్లూరులో అండర్ 11 బాల బాలికల రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తా మన్నారు. ప్రతిభకల్గిన క్రీడాకారులను తమ సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్య క్రమంలో జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు దూడల సుధాకర్, కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు మద్దిపాటి ప్రసాద్ రావు, రామ్మోహన్ రావు, తాళ్లపాక వరప్రసాద్, జిల్లా క్రీడాపాధికార సంస్థ అధికారి ఎత్తిరాజ్, విజయకుమార్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అచ్చమాంబకు పొంగళ్ళు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ ఆలయం వద్ద ఆదివారం భక్తులు ఘనంగా పొంగళ్ళు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసాలు ఉండి అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నెలకొన్న ఈ ఆలయం వద్దకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

